


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 343 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 13 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :343 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 13 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం



- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజాప్రతినిధులకు జగన్ పిలుపు
- డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వం స్పందించడం లేదన్న బొత్స
- 40 శాతం ఓట్లు వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి, కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శాసనసభా పక్ష సమావేశంలో సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశంలో చర్చించిన కీలక అంశాలను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు వెల్లడించారు.డీఎస్సీ నియామకాల

- మిగతా 2లో

## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి.. ఆధారాలతో చర్చకు మేం సిద్ధం



- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన అనిత
- రోడ్డు మీద నిలబడి ఆరోపణలు చేయడం కాదంటూ జగన్ కు కౌంటర్
- సభకు వచ్చి ఆధారాలు చూపాలని సవాల్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ కు ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని, రోడ్ల మీద నిలబడి చేసే ఆరోపణలకు సభలో ఆధారాలు చూపాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. శాసనసభకు రాకుండా బయట విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె అన్నారు. బుధవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతులు స్వీకరించిన అనంతరం

- మిగతా 2లో



## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

### సీఎం చంద్రబాబు ఆదేశాలు

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పరిశ్రమలకు ఇచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలను (ఇన్సెంటివ్స్) నేరుగా ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని

- మిగతా 2లో

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్



పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.
ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్

- మిగతా 2లో



## చంద్రబాబు ఒక విజనరీ లీడర్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా

- మిగతా 2లో



## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్ననికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని,

- మిగతా 2లో

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- దేశంలోని టాప్ 500 లిస్టెడ్ కంపెనీల్లో కేవలం 9 మందే మహిళా సీఈవోలు
- ఇదే కంపెనీల్లో 25 మంది మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు
- మహిళా డైరెక్టర్లను నియమించని సంస్థలకు రూ.71 లక్షల జరిమానా
- మొత్తం కంపెనీల్లో మాత్రం 11 లక్షల మందికి పైగా మహిళా డైరెక్టర్లు



పెన్ పవర్ డెస్క్:భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

- మిగతా 2లో



## భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

- డిజిలాకర్ యూజర్ల సంఖ్య 72.43 కోట్లు దాటిందని కేంద్రం వెల్లడి
- గత మూడేళ్లలో ఉమంగ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 798 కోట్ల లావాదేవీలు
- డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పౌర సేవలు మరింత సులభతరం
- గ్రామ పంచాయతీ స్థాయిలో 4 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు
- మహిళల ఆధ్వర్యంలో 70,000కు పైగా సీఎస్‌సీల నిర్వహణ

- మిగతా 2లో

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు




పెన్ పవర్ డెస్క్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.
రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## రోగి ప్రాణమా... ప్రైవేట్ ఆసుపత్రి బిల్లా?

రూమ్ చార్జీలపై పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక హెచ్చరిక మాత్రమే... అసలు ప్రశ్న 'మెడికల్ మాఫియా'ను ఎవరు కట్టడి చేస్తారు?

ఆసుపత్రి గుమ్మం తొక్కిన క్షణం నుంచి సామాన్యుడి గుండెల్లో ఒకటే భయం... రోగం నయం అవుతుందా? లేక బిల్లు కట్టేలోపే ఆస్తి కరిగిపోతుందా?

దేశంలో పెరుగుతున్న వైద్య ఖర్చులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన తాజా సిఫార్సులు ఈ భయానికి అద్దం పడుతున్నాయి. మెట్రో నగరాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల రూమ్ చార్జీలను సమీపంలోని 3-స్టార్ హోటళ్ల సగటు అద్దెకు మించకుండా పరిమితం చేయాలని కమిటీ సూచించడం చిన్న విషయం కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగటు చికిత్స వ్యయం రూ.6,631గా ఉంటే, ప్రైవేటు ఆసుపత్రుల్లో అదే రూ.50,508కు చేరుతున్నదన్న గణాంకం వైద్య రంగంలో పెరిగిన వ్యాపారీకరణకు స్పష్టమైన సంకేతం.

**అయితే... రూమ్ చార్జీలను పరిమితం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందా?**

ఖచ్చితంగా కాదు.

రోగి ఆసుపత్రిలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి బిల్లు ఎలా పెరుగుతోంది?

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి తీసుకెళ్లిన రోగి కుటుంబానికి ముందుగా అడిగే ప్రశ్న చాలాసార్లు "ఎంత ఖర్చవుతుంది?" అన్నదే. పరిస్థితి తీవ్రంగా ఉందని చెబుతూ వెంటనే అడ్మిషన్. ఆ తర్వాత వరుసగా రక్త పరీక్షలు, స్కాన్లు, ఇతర డయాగ్నస్టిక్ పరీక్షలు. ప్రతి పరీక్షకు ప్రత్యేక బిల్లు. ఒక వైద్యుడి అభిప్రాయం తర్వాత మరో స్పెషలిస్టు. అవసరమని చెబుతూ మరిన్ని పరీక్షలు. చివరకు డిశ్చార్జ్ సమయానికి కుటుంబం ఊహించని స్థాయిలో బిల్లు చేతిలో పెట్టడం...

ఇదంతా ప్రతి ఆసుపత్రిలో జరుగుతోందని చెప్పలేం. వేలాది వైద్యులు, ఆసుపత్రులు నిబద్ధతతో సేవలందిస్తున్నాయి. కానీ కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం సేవ నుంచి వ్యాపార మోడల్‌గా మారుతున్నదన్న ప్రజల ఆందోళనను మాత్రం విస్మరించలేం.

'ప్యాకేజీ' పేరుతో పేదవాడి జేబుకు గండివైద్యరంగంలో పారదర్శకత అత్యంత అవసరం. ఒక ఆపరేషన్‌కు ఎంత? డాక్టర్ ఫీజు ఎంత? ఆసుపత్రి సేవా రుసుము ఎంత? మందుల ఖర్చు ఎంత? పరీక్షల ఖర్చు ఎంత? గది అద్దె ఎంత? నర్సింగ్ ఛార్జీలు ఎంత?

ఇవన్నీ ముందుగానే స్పష్టంగా చెప్పే వ్యవస్థ ఉండాలి.

రోగి ఆసుపత్రిలో ఉన్నప్పుడు అతని బలహీనతను ఆసుపత్రి బిల్లింగ్ వ్యవస్థకు బలంగా మార్చకూడదు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన కుటుంబం బేరసారాలు చేసే పరిస్థితిలో ఉండదు. ఆ సమయంలో ఆసుపత్రి చెప్పిందే నిజమని నమ్మాల్సి వస్తుంది. ఈ పరిస్థితినే దుర్వినియోగం చేసే వ్యవస్థ ఎక్కడైనా ఉంటే దానిని నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత.

**మెడికల్ మాఫియా అంటే కేవలం ఆసుపత్రి కాదు... ఒక వ్యవస్థ**

ప్రైవేటు వైద్య రంగంపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ మొత్తం వైద్య వృత్తినే నిందించడం సరికాదు. అసలు సమస్య ఎక్కడుందో గుర్తించాలి. అనవసర పరీక్షలు, అవసరానికి మించిన చికిత్సలు, అధిక ధరల మందులు, రోగికి తెలియని అదనపు ఛార్జీలు, స్పష్టత లేని ప్యాకేజీలు, ముందస్తు అంచనా లేకుండా పెరుగుతున్న బిల్లులు-ఇలాంటి అంశాలపై కఠినమైన నియంత్రణ అవసరం. వైద్యం వ్యాపారం కావచ్చు... కానీ రోగి నిస్సహాయత మాత్రం వ్యాపార వస్తువు కాకూడదు.

**హోటల్‌తో ఆసుపత్రిని పోల్చడం సరైనదా?**

ఆసుపత్రి యాజమాన్యాలు చెబుతున్న అభ్యంతరంలో కూడా కొంత వాస్తవం ఉంది. హోటల్ గది, ఆసుపత్రి గది ఒకటి కాదు. ఆసుపత్రిలో నర్సింగ్, వైద్య పర్యవేక్షణ, అత్యవసర సదుపాయాలు, పరిశుభ్రత, వైద్య పరికరాలు వంటి అదనపు సేవలు ఉంటాయి. కానీ అదే సమయంలో ఈ వాదన పేరుతో అనియంత్రిత రూమ్ చార్జీలకు తలుపులు తెరిచి ఉంచడం కూడా సమర్థనీయం కాదు. కాబట్టి పరిష్కారం హోటల్ అద్దెను యథాతథంగా అమలు చేయడం మాత్రమే కాకుండా, ఆసుపత్రుల రూమ్ కేటగిరీలకు శాస్త్రీయమైన ధరల ప్రమాణాలు రూపొందించడం కావాలి.

**ఇంకా ముఖ్యమైనది-పరీక్షల ధరల నియంత్రణ**

పార్లమెంటరీ కమిటీ సూచించిన మరో అంశం అత్యంత కీలకం. చికిత్సతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ అవసరం.

ఒకే నగరంలో, ఒకే రకమైన పరీక్షకు వేర్వేరు ఆసుపత్రుల్లో భారీగా ధరల తేడా ఉంటే సామాన్యుడు ఎవరిని నమ్మాలి?ప్రతి ముఖ్యమైన పరీక్షకు రాష్ట్రాల వారీగా లేదా ప్రాంతాల వారీగా గరిష్ఠ ధరల పరిమితి ఉండాలి.ఆ ధరలు ఆసుపత్రులలో, వెబ్‌సైట్లలో, బిల్లింగ్ కౌంటర్లలో స్పష్టంగా కనిపించేలా చేయాలి.

**'ఎంత ఖర్చవుతుంది?' అని అడిగే హక్కు ప్రతి రోగిదే**

చికిత్స ప్రారంభించే ముందు సాధ్యమైనంతవరకు అంచనా వ్యయాన్ని రోగి కుటుంబానికి తెలియజేయాలి. చికిత్స మధ్యలో అనూహ్య మార్పులు వచ్చినప్పుడు వాటి కారణాన్ని, అదనపు ఖర్చును వివరించాలి.

రోగి కుటుంబానికి వివరమైన, అర్థమయ్యే బిల్లు ఇవ్వడం తప్పనిసరి కావాలి.

అదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ముందుగా డబ్బు కట్టలేదనే కారణంతో ప్రాణరక్షక చికిత్సను నిరాకరించే పరిస్థితులు రాకుండా కూడా బలమైన నిబంధనలు అవసరం.

**ఆరోగ్యం హక్కా? లేక కొనగలిగిన వస్తువా?**

**ఈ ప్రశ్న ఇప్పుడు దేశం ముందుంది.**

డబ్బున్నవాడికి అత్యుత్తమ వైద్యం... డబ్బులేని వాడికి అప్పు చేసి వైద్యం... అప్పు కూడా దొరకని వాడికి విధి నిర్ణయం-ఇలాంటి పరిస్థితి ఒక సంక్షేమ రాజ్యానికి గర్వకారణం కాదు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, వైద్య సిబ్బందిని పెంచడం, అత్యాధునిక పరికరాలు అందించడం, మందులు అందుబాటులో ఉంచడం వంటి చర్యలతో పాటు ప్రైవేటు వైద్య రంగంలో పారదర్శకత, ధరల నియంత్రణ, రోగి హక్కుల పరిరక్షణ కూడా సమాంతరంగా జరగాలి. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక మంచి ప్రారంభం. కానీ అవి కాగితాలకే పరిమితమైతే ప్రయోజనం లేదు.ఆసుపత్రి బిల్లు చూసి రోగి కుటుంబం మరోసారి అనారోగ్యానికి గురికాకుండా ఉండే రోజే నిజమైన వైద్య సంస్కరణలకు నాంది.

**ప్రాణాలను కాపాడాల్సిన వైద్య వ్యవస్థ...**

ప్రాణం మీద పడే ఆర్థిక భారానికి కారణం కాకూడదు.ప్రైవేటు ఆసుపత్రులపై ఆరోపణలు చేయడం సులభం.వ్యవస్థను ప్రక్షాళన చేయడం కష్టం.అందుకే ఇప్పుడు ప్రభుత్వానికి కావాల్సింది కేవలం సిఫార్సుల అమలు కాదు-వైద్యం పేరుతో జరిగే దోపిడీకి అడ్డుకట్ట వేసే సమగ్ర చట్టబద్ధ వ్యవస్థ.

రోగి ముందుగా... లాభం తర్వాత.

వైద్యం సేవగా నిలవాలి... వ్యాపార దందాగా మారకూడదు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- మొదటి పేజి తరువాయి

వివరించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు.

రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, నిధుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకాలు తప్పనిసరి అని, అయితే వాటిని ఎంతవరకు ఇవ్వగలమనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు.బుధవారం (ఆగస్టు 12) నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ భేటీలో పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 25 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా, తద్వారా ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, తద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.86 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం సంప్రదాయ పరిశ్రమలే కాకుండా భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి అధునాతన రంగాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వాటిపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపైనే విశాఖ పరిశ్రమలకు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకునేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికే గర్వకారణమని, పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం వద్ద ఏరోస్పేస్ ప్రాజెక్టులు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రోడ్, రైల్, పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలన్నారు. సెప్టెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# చంద్రబాబు ఒక విజనరీ లీడర్

- మొదటి పేజి తరువాయి

అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహూకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు.

కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు.మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

దేశంలో డిజిటల్ సేవలు విస్తృతంగా ప్రజలకు చేరువవుతున్నాయని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లైన 'డిజిలాకర్', 'ఉమంగ్' అద్భుతమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నేడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లలో డిజిలాకర్ వినియోగదారుల సంఖ్య 72.43 కోట్లకు చేరిందని, ఈ ప్లాట్‌ఫామ్‌పై 72.86 కోట్ల డాక్యుమెంట్ యాక్సెస్ లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. అదే సమయంలో 'ఉమంగ్' ప్లాట్‌ఫామ్‌లో 11.66 కోట్లకు పైగా యూజర్లు నమోదు కాగా, సుమారు 798 కోట్ల లావాదేవీలు నమోదైనట్లు వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా, టెక్నాలజీని సామాన్య ప్రజలకు దగ్గర చేసే లక్ష్యంతో 2015 జులైలో 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పౌర కేంద్రీకృత సేవలను సులభంగా అందించేందుకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది జులై 31 నాటికి దేశవ్యాప్తంగా ఉమాంగ్ ప్లాట్‌ఫామ్‌పై 2,575 సేవలు (కేంద్రం: 880, రాష్ట్రాలు: 1,695), డిజిలాకర్‌పై 5,437 రకాల డాక్యుమెంట్లు/సేవలు (కేంద్రం: 661, రాష్ట్రాలు: 4,776) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవలను అందించేందుకు 'కామన్ సర్వీస్ సెంటర్ల' (సీఎస్‌సీ) నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026 జూన్ 30 నాటికి గ్రామ పంచాయతీ స్థాయిలో 4,07,122 సీఎస్‌సీలు పనిచేస్తున్నాయని, వీటిలో 70,069 కేంద్రాలను మహిళా పారిశ్రామికవేత్తలు (విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నిర్వహిస్తుండటం విశేషమని అన్నారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా, పింఛను వంటి అనేక సేవలను ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

ఉమంగ్, డిజిలాకర్ ప్లాట్‌ఫామ్‌లు మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల పౌరులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రభుత్వ సేవలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఆధార్, ఈ-సైన్, ఏపీఐ సేతు వంటి కీలకమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఈ ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానించామని, తద్వారా సురక్షితమైన, కాగితరహిత సేవలు అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల భౌతికంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం తగ్గి, పౌరులకు సమర్థవంతమైన సేవలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- మొదటి పేజి తరువాయి

తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి.. ఆధారాలతో చర్చకు మేం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

ఆమె మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు."ఎమ్మెల్యేగా గెలిచిన వారికి తమ నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం ప్రాథమిక బాధ్యత. కానీ జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకపోవడం విచారకరం. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని తీర్మానం చేసిన జగన్, ఇప్పుడు అదే మండలికి తమ ప్రతినిధులను పంపుతున్నారు. కానీ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలను మాత్రం అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు" అని అనిత ఆరోపించారు. ప్రభుత్వంపై చేసే ఆరోపణలకు అసెంబ్లీ కంటే మెరుగైన వేదిక మరొకటి లేదని, తాము ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఐదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు**

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి తీవ్రంగా ఖండించారు. "ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వైసీపీ నేతలు, ఇప్పుడు మేము పారదర్శకంగా నిర్వహిస్తుంటే నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది. డీఎస్సీపై ఆధారాలుంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమే" అని అన్నారు.

కష్టపడి చదివి, కుటుంబాలకు దూరంగా ఉండి, కోచింగ్‌లకు వేల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగాలు సాధించిన యువత ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించేలా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఆవేదన వ్యక్తం చేశారు. "మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే, ఉద్యోగం సాధించిన వారి కష్టాన్ని, ప్రతిభను కించపరిచినట్లే. రాజకీయాల కోసం యువత భవిష్యత్తుతో, వారి మనోభావాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

అంతకుముందు, హోంమంత్రి అనిత పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఓపికగా విని, మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. 'మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్' బాధితులు తమ గోడును వెళ్లబోసుకోగా, ప్రభుత్వం ఇప్పటికే డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఆర్థిక మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.అలాగే, నాయుడుపేట నుంచి వచ్చిన ఓ తండ్రి తన కుమార్తె చదువు, తన ఉపాధి గురించి మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే స్పందించారు. చిన్నారిని హాస్టల్‌లో చేర్పించి చదువు కొనసాగించేలా చూడాలని, తండ్రికి ఉపాధి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని అనిత పేర్కొన్నారు.

## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- మొదటి పేజి తరువాయి

దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు.ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- మొదటి పేజి తరువాయి

స్పోర్ట్స్ కోటాలో మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆధారాలున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బొత్స ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ అంశంపై శాసనమండలిలో పోరాడతామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అభివృద్ధి అంతా సీఎం చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రజా సమస్యలన్నింటినీ అసెంబ్లీ వేదికగా లేవనెత్తుతామన్నారు. 40 శాతం ఓటు షేర్ సాధించిన వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని మండిపడ్డారు. చట్టసభల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, ప్రభుత్వాన్ని ప్రతి అంశంలో ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.

# బంధన్‌పూడిలో మండల పార్టీ సమావేశం



**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 12:** కాజులూరు మండలం బంధన్‌పూడి గ్రామంలో బుధవారం మండల పార్టీ సమావేశం నిర్వహించారు. రెండో బుధవారం సందర్భంగా నిర్వహించిన ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యకలాపాలు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ మద్రాస్‌తో ఎంఓయూ





**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం**

**రూ.323 కోట్లతో తీర రక్షణ గోడ నిర్మాణం**

**నవంబర్ నుంచి పనులకు శ్రీకారం**

**అమరావతి/కాకినాడ,పెన్ పవర్,ఆగస్టు 12:** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. తీర రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.రూ.323 కోట్లతో ఉప్పాడ తీర రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్‌డీఎంఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్‌డీఎంఏ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది.

ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

నవంబర్ నుంచి పనులు ప్రారంభం

ఐఐటీ మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తవడంతో నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు,మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ శరవణన్,పాడా డైరెక్టర్ డా.ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఏ. సన్నాసిరాజ్,రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షం



**మాజీ జడ్పీటీసీ నులుకుర్తి**

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 12:** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, రెండేళ్ల పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు.కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్,మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రి వెంకటరాజు,నరసింగరావు,చొక్కా జగన్,మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్, గ్రామ పార్టీ కార్యదర్శి మేడిశెట్టి బుజ్జి, కొల్లుబోయిన వీరబాబు, వెంకటేశ్వర రావు, మాత లక్ష్మణ్,జంపన రామరాజు,గంధం శ్రీను, మాత ఆనంద్,కాళ్ల శ్రీనివాస్, లోవరాజు తదితరులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు,బూత్ కన్వీనర్లు, మత్స్యకారులు,బీసీ, ఎస్సీ వర్గాల ప్రతినిధులు,మహిళలు,యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయంలో చండీ యాగం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 12;**చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం ఆషాఢ బహుళ అమావాస్య సందర్భంగా చండీ యాగం నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వీరి అప్పారావు, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి అధ్వర్యంలో జరిగిన చండీయాగంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ యాగాన్ని గ్రామ ప్రజలు,భక్తులు తదితరులు వైభవంగా జరిపించగా,భక్తులు యాగంలో పలు రకాల ద్రవ్యాలను వేసి పూజించారు.అనంతరం భక్తజనం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ట్రస్టు బోర్డు సభ్యులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,ఆగస్టు,12:**ప్రత్తిపాడు మండలంలోని వేములపాలెం,ఎరుకంపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా శ్రీకారం చుట్టారు.వేములపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ,సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సుమారు రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదిని ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు.అనంతరం ఎరుకంపాలెం గ్రామంలో రాజ్యసభ సభ్యుడు సానాసతీష్ బాబు నిధుల నుంచి సుమారు రూ.10 లక్షల వ్యయంతో వినాయకుడి గుడి నుంచి శివాలయం వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని,ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబి,ఎంఈఓలు రాజబాబు,అచ్చిరాజు,స్థానిక నాయకుడు,టిడిపి స్టేట్ యూత్ సెక్రెటరీ లొండ లోవరాజు,మాజీ సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు,సీనియర్ టిడిపి నాయకుడు రెడ్డి అమర్నాథ్ చౌదరి,కూటమి నాయకులు గొంతిన సురేష్,మంతెన వెంకటరమణ,ఇళ్ల అప్పారావు,అడ్డాల త్రిమూర్తులు,మిరియాల శ్రీను,నిమ్మల రాంబాబు,యర్రాబత్తుల గోవిందదునాయుడు,సుంకర భవాని,కొంగన నాని, గుండం సత్తిబాబు తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి.

**-అభివృద్ధి,సంక్షేమం ఇంటింట ప్రచారంలో ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 12:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వేములపాలెం గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.స్థానిక నాయకులు లొండ లోవరాజు,వనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయడంతో పాటు,గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబి,టీడీపీ స్టేట్ యూత్ సెక్రటరీ లొండ లోవరాజు,మాజీ సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు,సీనియర్ టీడీపీ నాయకుడు రెడ్డి అమర్నాథ్ చౌదరి,కూటమి నాయకులు గొంతిన సురేష్,మంతెన వెంకటరమణ,ఇళ్ల అప్పారావు,అడ్డాల త్రిమూర్తులు, మిరియాల శ్రీను,నిమ్మల రాంబాబు,యర్రాబత్తుల గోవిందదునాయుడు, తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# సత్యగిరి భూముల సర్వేకు ఆటంకం -- ఈఓ చర్చలతో వివాదం సద్దుమణిగింది





**అన్నవరం:పెన్ పవర్ ఆగస్ట్ 12** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన సత్యగిరి కొండ భూముల సర్వే ప్రక్రియ గత మూడు రోజులుగా శాంతియుతంగా, పారదర్శకంగా కొనసాగుతోంది.

బుధవారం అధికారులు సర్వే పనులు నిర్వహిస్తున్న సమయంలో స్థానికంగా కొందరు వ్యక్తులు సర్వేకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) శ్రీ సూర్యచక్రధరరావు వెంటనే స్పందించి, సర్వేను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారితో నేరుగా మాట్లాడారు.

దేవస్థాన భూముల సరిహద్దుల నిర్ధారణ, లెక్కింపు మరియు సర్వే ప్రక్రియ సక్రమంగా పూర్తికావడం అందరికీ మేలు చేస్తుందని ఈఓ వారికి వివరించారు. ఎవరికైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సర్వే పూర్తయిన అనంతరం రాతపూర్వకంగా కార్యనిర్వహణాధికారిని కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.

అయితే సర్వే ప్రక్రియకు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓ స్పష్టం చేశారు.

ఈఓ సూచనలకు స్థానికులు సానుకూలంగా స్పందించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సర్వే పనులు తిరిగి యథావిధిగా ప్రారంభమై సజావుగా కొనసాగాయి.

# యువతా... మీరే దేశ భవితకు దిశానిర్దేశకులు!




**గండేపల్లి , పెన్ పవర్, (సూరంపాలెం) ఆగస్టు ,12:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులకు 'యువతా మీరే ఈ దేశ భవిత' అనే అంశంపై వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వివేకానంద సమితి, అమలాపురం--ప్రత్తిపాడు వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన, క్రమశిక్షణపై స్ఫూర్తిని నింపింది.

కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డి. నాగిరెడ్డి, పెద్దాపురం క్రైమ్ బ్రాంచ్ సీఐ ఆర్. అంకబాబు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

సీఐ ఆర్. అంకబాబు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకుండా, అత్యంత వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చవద్దని హితవు పలికారు. జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

సైకాలజిస్ట్ డి. నాగిరెడ్డి మాట్లాడుతూ వైద్యుడి బాధ్యత వైద్యం చేయడం, రైతు బాధ్యత పంటలు పండించడం, పోలీసు బాధ్యత ప్రజలకు రక్షణ కల్పించడం మాదిరిగానే విద్యార్థుల ప్రధాన బాధ్యత చదువుకోవడం, నేర్చుకోవడమేనన్నారు. అనవసర విషయాలకు, సోషల్ మీడియాకు విలువైన సమయాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

తల్లిదండ్రులు ఎన్నో ఆశలు, ఆశయాలతో వ్యయప్రయాసలకు ఓర్చి పిల్లల భవిష్యత్తు కోసం చదివిస్తున్నారని, అందువల్ల తమ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని తెలిపారు. కుల, మత, వర్ణ, వర్గ భేదాలకు అతీతంగా ఒక వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగల శక్తి చదువుకే ఉందనే విషయాన్ని మరువరాదని అన్నారు.

మహాత్మా గాంధీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవితాలను అధ్యయనం చేయడంతో పాటు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి జీవితం నుంచి కూడా విద్యార్థులు స్ఫూర్తి పొందాలని నాగిరెడ్డి సూచించారు. నిరంతర కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాలను సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు డాక్టర్ కుమార్, డాక్టర్ సుబ్బారావు, వివేకానంద సమితి సభ్యులు సలాది శ్రీరామచంద్రమూర్తి, జి. నాగరాజు, ప్రొ. కట్టా పావని, శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు టి. గంగాధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరానికి సామర్లకోట రైల్వే స్టేషన్ కేంద్రబిందువు!





- గాంధీ నుంచి నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ వరకు మహనీయుల అడుగుజాడలు
- సామర్లకోట--పెద్దాపురం స్వాతంత్ర్య పోరాట చరిత్రను పుస్తక రూపంలో ఆవిష్కరణ

**పెన్ పవర్, ప్రతినిధి (సామర్లకోట) ఆగస్టు 12:** స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సామర్లకోట రైల్వే స్టేషన్ కీలక కేంద్రంగా నిలిచిందని పుస్తక రచయిత వంగలపూడి శివకృష్ణ పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సామర్లకోట--పెద్దాపురం ప్రాంతానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన రచించిన 'స్వాతంత్ర్య ఉద్యమంలో సామర్లకోట--పెద్దాపురం' పుస్తకావిష్కరణకు సంబంధించిన గోడపత్రికను బుధవారం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ 1893లో నిర్మితమైన సామర్లకోట రైల్వే స్టేషన్ స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన అనేక చారిత్రక ఘట్టాలకు వేదికగా నిలిచిందని తెలిపారు. మహాత్మా గాంధీ, సుభాష్‌చంద్రబోస్, మౌలానా మహమ్మద్ అలీ, జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి జాతీయ నాయకులు సామర్లకోటకు విచ్చేసి సభలు, సమావేశాలు నిర్వహించారని పేర్కొన్నారు.

ఆ మహనీయుల ప్రసంగాలతో సామర్లకోట--పెద్దాపురం ప్రాంత ప్రజల్లో జాతీయ భావాలను, స్వాతంత్ర్య కాంక్షను రగిలించారని తెలిపారు. ఈ ప్రాంత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను ఆధారాలతో ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని రచించినట్లు వెల్లడించారు.

ఈ నెల 14న పుస్తకావిష్కరణ

'స్వాతంత్ర్య ఉద్యమంలో సామర్లకోట--పెద్దాపురం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీ శుక్రవారం సాయంత్రం పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మహాత్మాగాంధీ పార్క్‌లో నిర్వహించనున్నట్లు శివకృష్ణ తెలిపారు.

స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వచ్చిన చారిత్రక నేపథ్యాన్ని నేటి తరానికి గుర్తుచేయడం అభినందనీయమన్నారు. రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్న శివకృష్ణను అభినందించారు. ప్రతి పౌరుడు దేశం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ దేశాభివృద్ధికి తన వంతు కృషి చేయాలని సూచించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరాం కృష్ణ మాట్లాడుతూ సామర్లకోట--పెద్దాపురం ప్రాంత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. పుస్తకాలు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా నాటి సామాజిక పరిస్థితులు, దేశభక్తి, మానవతా విలువలను యువతకు పరిచయం చేస్తాయని అన్నారు.

కార్యక్రమంలో సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సరోజ వాసు, మడగల శ్యామ్, రెడ్డిపల్లి రమణమూర్తి, పెదిరెడ్డి నరేష్, క్రాంతికుమార్, కరణం భాను, బాలం హరి, సిరిపురపు శ్రీనివాస్, విల్లా లక్ష్మి, వడ్డి సత్యనారాయణ, నవీన్ నాని, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎ ఎ ఎన్ తెలుగు. ప్రతిష్టాత్మక అవార్డుతో అన్నవరం ఈఓ నల్లం సూర్యచక్రధరరావుకు ఘన సన్మానం



**అన్నవరం: ప్రముఖ పెన్ పవర్ ఆగస్ట్ 12 .** ఎ ఎ ఎన్ తెలుగు ఛానల్ అందజేసిన ప్రతిష్టాత్మక అవార్డును అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) నల్లం సూర్యచక్రధరరావు అందుకున్న సందర్భంగా దేవస్థానం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ శుభ సందర్భంగా బుధవారం దేవస్థానంలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి (ఈఓ) నల్లం సూర్యచక్రధరరావును ఘనంగా అభినందించారు.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాల్లో (ఈఓ) నల్లం సూర్యచక్రధరరావు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించడం పట్ల దేవస్థానం సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, దేవస్థానం అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, ఆలయ నిర్వహణ, పారిశుద్ధ్యం, వసతి, సేవల నిర్వహణ వంటి పలు అంశాలపై (ఈఓ) ప్రత్యేక దృష్టి సారిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ దేవస్థాన పరిపాలనను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని తెలిపారు.

ఎ ఎ ఎన్ తెలుగు . ఛానల్ అందించిన ఈ అవార్డు కేవలం ఈఓ నల్లం సూర్యచక్రధరరావుకు మాత్రమే కాకుండా, అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి, సిబ్బందికి లభించిన గౌరవంగా భావిస్తున్నామని ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ అవార్డు తమలో మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉత్సాహంగా పనిచేస్తామని తెలిపారు.

అవార్డు అందుకున్న ఈఓ నల్లం సూర్యచక్రధరరావును దేవస్థానం ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఈఓ నల్లం సూర్యచక్రధరరావు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం వెనుక దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి ఉందని అన్నారు. దేవస్థాన అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడం వల్లే మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచే విధంగా సేవలను కొనసాగించేందుకు అధికారులు, ఉద్యోగులు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పరిపాలనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ఎ ఎ ఎన్ తెలుగు. ప్రతిష్టాత్మక అవార్డుతో అన్నవరం దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావుకు లభించిన ఈ గుర్తింపు పట్ల దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం దేవస్థానం ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపింది.

# గ్రంథాలయాలు విద్యార్థులకు మంచి నేస్తాలు



**ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు**

**గండేపల్లి, పెన్ పవర్,(సూరంపాలెం) ఆగస్టు, 12:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో బుధవారం గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు, ఆధునిక గ్రంథాలయ రూపకర్త శ్రీ ఎస్.ఆర్. రంగనాథ్ చిత్రపటానికి యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల విజ్ఞాన వికాసంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, పుస్తక పఠనాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని సూచించారు.

డీన్ డా. డి. కిషోర్ మాట్లాడుతూ "గ్రంథాలయాలు విద్యార్థులకు మంచి నేస్తాలు. వాటిని ఎంత ఎక్కువగా ఉపయోగించుకుంటే అంత ఎక్కువ జ్ఞానం పొందవచ్చు" అన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు, ప్రముఖుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా స్ఫూర్తి పొందాలని విద్యార్థులకు సూచించారు.

ప్రధాన గ్రంథాలయాధికారి కె. అశోక్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రంథాలయం రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు 'బుక్ టైటిల్ మెమరీ కాంపిటీషన్' నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాన్ని అత్యుత్తమంగా వినియోగించిన విద్యార్థులు, అధ్యాపకులను 'బెస్ట్ లైబ్రరీ యూజర్' అవార్డులతో సత్కరించారు.

కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, గ్రంథాలయ విభాగాధిపతి కె. అశోక్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపస్‌లోని వివిధ గ్రంథాలయాల్లోనూ అధికారులు, ఆయా విభాగాల అధిపతులు ఎస్.ఆర్. రంగనాథ్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి గ్రంథపాలకుల దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కథల పోటీకి ఆహ్వానం



- గడువు తేదీని ఆగష్టు 20 వరకు పొడిగింపు
- ఆలమూరు శాఖా గ్రంథాలయంలో కరపత్రాల ఆవిష్కరణ

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 12;** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో కథల పోటీకి రచయితల నుంచి కథలను ఆహ్వానిస్తున్నట్లు శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ (రి) కన్వీనర్ అంగర గోపాలాచార్యులు(కృష్ణశ్రీ) తెలిపారు. బుధవారం ఆలమూరు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాధికారి టి నమశ్శివాయ చేతుల మీదుగా ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. "కుటుంబ విలువలు" అనే అంశంపై రచయితల నుంచి కథలను ఆహ్వానిస్తున్నట్లు, ఎటువంటి రాజకీయ, మత, కుల, ప్రాంత పరమైన అంశాలు లేకుండా, సమాజ విలువలు ప్రతిబింబించే, కుటుంబ విలువలు అంశంపై కథలను పంపించాలని కృష్ణ శ్రీ తెలిపారు. పోటీలకు చివరి తేదీని రచయితల కోరిక మేరకు ఆగస్టు 20 వరకూ పొడిగిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు తెలుగు భాషా దినోత్సవం రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఇతర వివరాలకు 9963163136 నెంబర్లో సంప్రదించాలన్నారు. గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా పాఠకులందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో గొడవర్తి రామకృష్ణ, వెల్ల కిరణ్, ఇతర పాఠకులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 12:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ రంగానికి విశేష సేవలందించిన డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ గొప్పతనాన్ని, ఆయన గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. గ్రంథాలయం విజ్ఞాన భాండాగారం వంటిది అని, గ్రంథాలయాలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, పఠనాసక్తిని, పరిశోధనా దృక్పథాన్ని మరియు విజ్ఞానాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. డా. ఎస్. ఆర్. రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన సూచించిన గ్రంథాలయ సూత్రాలు నేటికీ గ్రంథాలయ నిర్వహణలో ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని తమ జ్ఞానాన్ని విస్తృతం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్చార్జి డాక్టర్ డి.సత్యలత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మహోత్సవాలు




**సహస్ర ఘటాభిషేకంతో ముగిసిన ఆషాఢ మాస మహోత్సవాలు -- భక్తులతో కిటకిటలాడిన లోవ పుణ్యక్షేత్రం**





**పెన్ పవర్ ప్రతినిధి (లోవ) ఆగస్టు, 12** ప్రముఖ పుణ్యక్షేత్రమైన లోవ గ్రామంలోని శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన ఆషాఢ మాస మహోత్సవాలు సహస్ర ఘటాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం శ్రీ అమ్మవారికి సహస్ర ఘటాభిషేక కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
విఘ్నేశ్వర పూజ, మండపారాధనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, పవిత్ర సప్తనదీ జలాలను ఆవాహన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ పూజా జలాలను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణగా తీసుకువచ్చి శ్రీ అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు మూలవిరాట్‌కు సప్తనదీ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు.
అనంతరం మహామండపంలో కొలువై ఉన్న శ్రీ అమ్మవారి పంచలోహ విగ్రహాలకు సప్తనదీ జలాలు, పరిమళ సుగంధ ద్రవ్యాలు, మంగళ ద్రవ్యాలతో ఘనంగా అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
నీరాజనం, మంత్రపుష్పం అనంతరం ఆలయ వేదపండితులు భక్తులకు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తలు, మండలి సభ్యులు, శ్రీవారి సేవకులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ప్రతి సంవత్సరం నిర్వహించే ఘటాభిషేక కార్యక్రమం ద్వారా ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయంలో నిర్వహించే పూజాది కార్యక్రమాల్లో తెలియక జరిగే దోషాలు తొలగిపోతాయని, అమ్మవారి దైవిక శక్తి మరింత పెంపొందడంతో భక్తుల మనోసంకల్పాలు సిద్ధిస్తాయని వేదపండితులు వివరించారు.
సహస్ర ఘటాభిషేకంతో శ్రీ తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాస మహోత్సవాలు వైభవంగా ముగిశాయని దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థి లీడర్ల ప్రమాణ స్వీకారం




**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 12:**రావులపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో నూతనంగా ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ బాయ్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎంవీఐ ఆర్. షణ్ముఖ శ్రీనివాస్, మండపేట రీజినల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, షాష్‌లు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. నాయకత్వం హోదా కాదని, సేవాభావంతో కూడిన బాధ్యత అని ముఖ్య అతిథులు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తునిలో పశువుల అక్రమ రవాణా గుట్టురట్టు






- రెండు కంటైనర్ లారీల్లో 62 పశువులు పట్టివేత
- పాయకరావుపేట నుంచి సూళ్లూరుపేటకు తరలిస్తుండగా పోలీసుల తనిఖీలు

**పెన్ పవర్ ప్రతినిధి(తుని) ఆగస్టు, 12:**తునిలో పశువుల అక్రమ రవాణా గుట్టురట్టైంది. పాయకరావుపేట నుంచి సూళ్లూరుపేటకు పశువులను తరలిస్తున్న రెండు కంటైనర్ లారీలను పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాల్లో కలిపి మొత్తం 62 పశువులు ఉన్నట్లు గుర్తించారు.
పోలీసుల తనిఖీల్లో ఒక కంటైనర్‌లో 30 పశువులు, మరో కంటైనర్‌లో 32 పశువులు ఉన్నట్లు తేలింది. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.
అనంతరం 62 పశువులను గోశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసి, పశువుల తరలింపు వెనుక ఉన్న వ్యక్తులు, వాహనాల వివరాలపై దర్యాప్తు చేపట్టారు.
తునిలో పోలీసుల తనిఖీలతో కలకలం
పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా రెండు కంటైనర్ లారీలు పట్టుబడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పశువులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.




## సత్యదేవుని 136వ సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అన్నవరం: పెన్ పవర్ ఆగస్ట్ 12** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రీ స్వామివారి 136వ సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం (జయంతి) వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
దేవస్థానం వైదిక కమిటీ నిర్ణయం మేరకు ఆగస్టు 13న శ్రావణ శుద్ధ పాడ్యమి, గురువారం రోజున ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణలు, శ్రీ స్వామివారి గర్భాలయంలో కలశ స్థాపన, వేద పారాయణాలు, జపాలు, మండపారాధనలు, నవగ్రహ మరియు మూలమంత్ర జపాలు, చండీ పారాయణ, సూర్యనమస్కారాలు, లింగార్చన, అశ్వత్థ ప్రదక్షిణ వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
అదే రోజు సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభమై, అనంతరం నివేదన, నీరాజనం, మంత్రపుష్పాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
ఆగస్టు 14న శ్రావణ శుద్ధ విదియ, శుక్రవారం సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం (జయంతి) సందర్భంగా తెల్లవారుజామున శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవార పంచామృత అభిషేకం, మఖా నక్షత్ర అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం జపాలు, పారాయణాలు, నవగ్రహ హోమాలు, మూలమంత్ర హోమాలు, ఆయుష్య హోమం వంటి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.
ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమంతో ఈ వైదిక క్రతువులు ముగియనున్నాయి. జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అన్నవరం తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

## గ్రంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథన్ జయంతి వేడుకలు




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 12:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్యదర్శి కుమారి మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ రంగానికి డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ విశిష్ట సేవలు అందించిన మహనీయు డని అన్నారు.ఆయన రూపొందించిన ద్విబిందు వర్గీకరణ పద్ధతి గ్రంథాలయ శాస్త్రంలో ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు.గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించ డంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన ప్రతిపాదించిన "గ్రంథాలయ పంచసూత్రాలు" గ్రంథాలయ సేవల ప్రాముఖ్యతను తెలియజేస్తాయని తెలిపారు.ఆధునిక సాంకేతిక యుగంలో గ్రంథాలయాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, పుస్తక పఠనాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.డాక్టర్ రంగనాథన్ ఆశయాలకు అనుగుణంగా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ఆయన సేవలు, సిద్ధాంతాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు.గ్రంథాలయ సీనియర్ పాఠకుడు జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని గ్రంథాలయ ఉద్యోగుల దినోత్సవంగా కూడా నిర్వహిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఇన్‌చార్జ్ కె. కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, గ్రంథాలయ సిబ్బంది టి. సాయి వెంకట్రావు,టి.వీర్రాజు, ఎన్.వి.ఎస్. ఫణీంద్ర కుమార్,జి.దుర్గా ప్రసాద్,నాగేంద్ర కుమార్,వి.అరుణ, పాఠకులు,విద్యార్థులు తదితరులు పాల్గొని డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## చిన్నారుల పాకెట్ మనీతో 80 జాతీయ జెండాల పంపిణీకి శ్రీకారం



**ఆత్రేయపురం పెన్ పవర్. ఆగస్టు 12:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన బాల ఇంద్రజాలికుడు రుషిత్, తన చెల్లెలు జాన్వికతో కలిసి దాచుకున్న పాకెట్ మనీతో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 80 జాతీయ జెండాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు.
ర్యాలిలోని స్థానిక మ్యాజిక్ హౌస్‌లో జెండాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత నాలుగు సంవత్సరాలుగా రుషిత్ ప్రతి సంవత్సరం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా జాతీయ జెండాలను పంపిణీ చేస్తూ దేశభక్తిని చాటుతున్నాడు.ఈ ఏడాది కూడా మూడు రోజులపాటు వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వృద్ధులకు 'వందేమాతరం' నినాదాలతో జెండాలను అందజేశారు.చిన్నారులు తమ పాకెట్ మనీని దేశభక్తి కార్యక్రమానికి వినియోగించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలని రుషిత్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రుషిత్ తల్లిదండ్రులు శ్రీకాంత్, తేజశ్రీ, అమ్మమ్మ అన్నపూర్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ కు రూ.20వేల విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 12;**ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ అధ్యక్షులు, ఆలమూరు సివిల్ కోర్ట్ ఏజిపి బూసి విద్యా ప్రసన్న ఆధ్వర్యంలో చింతలూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో చికిత్స పొందిన రోగులకు ఉచితంగా కళ్ళజోళ్ళు అందించడం కోసం రూ.20 వేలు చింతలూరు గ్రామానికి చెందిన గన్ని సూర్యలక్ష్మి విరాళంగా అందించారు.ఈ మొత్తానికిగాను బుధవారం ట్రస్ట్ చైర్మన్ బూసి విద్యాప్రసన్నకు సూర్యలక్ష్మి చెక్కును అందజేశారు. ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ సేవలకు తోడ్పాటు అందించినందుకు సూర్యలక్ష్మిని బూసి విద్యా ప్రసన్న, ముప్పిరి వెర్రియ్య అభినందించారు.

## పంట నమోదు తప్పనిసరి...




**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 12:-** సాగుదారులందరూ తమ పంటల వివరాలు రైతు సేవా కేంద్ర సిబ్బందితో నమోదు చేయించుకోవాలని తహసిల్దార్ ఎం సూరిబాబు రైతులకు సూచించారు. నెల్లిపూడిలో రైతన్నా....మీకోసం మరియు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి పి గాంధీ ఆధ్వర్యంలో రైతులకు సూచనలు ఇచ్చారు. వరి సాగు చేస్తున్న రైతులు అందరూ పంట నమోదు చేయించుకుని, పంట భీమా పథకంలో చేరాలని తెలిపారు.కొంతంగిలో వరి నారు మల్లును , నెల్లిపూడిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న వివిధ నమూనాలను రైతులతో పరిశీలించి సూచించారు. వ్యవసాయ ఉద్యాన సహాయకులు మణికంఠ,రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమరాజు, సత్తిబాబు, సుబ్రమణ్యం, రైతులు, మహిళలు పాల్గొన్నారు

## దేశ భక్తి గుండెల నిండా.. ప్రతి ఇంటా ఎగరాలి జెండా

* డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 12:**లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలని, దేశభక్తి ప్రతి గుండెలో నిండాలని పిలుపునిచ్చారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం ద్వారా దేశభక్తి, జాతీయ సమైక్యత భావనను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రాంగణంలో త్రివర్ణ పతాకాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు.డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి యువతే వెన్నెముక అన్నారు. విద్యతోపాటు సామాజిక బాధ్యత, దేశభక్తి భావాలను ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ గౌరవాన్ని చాటాలని యువతకు పిలుపునిచ్చారు.సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చూపిస్తున్న చురుకుదనం అభినందనీయమన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరావు,డి.అశ్విని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు పునరంకితం కావాలి

డాక్టర్ అడ్డాల సత్యనారాయణ



**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 12:**నేడు మనం సాధించిన స్వాతంత్ర్యాన్ని వేడుకగా జరుపుకోవడంతో పాటు, దేశ భవిష్యత్తును మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద లయన్స్ క్లబ్ స్టార్స్, బోట్ క్లబ్ వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ పతాకంతో బోట్ క్లబ్ నుంచి జేఎన్‌టీయూ వరకు దేశభక్తి ర్యాలీ నిర్వహించారు.లయన్స్ క్లబ్ సభ్యులు,రాజరాజేశ్వరి ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్,భగత్‌సింగ్,అల్లూరి సీతారామరాజు,పింగళి వెంకయ్యతో పాటు వేలాది మంది అమరవీరులు చేసిన త్యాగాలు,పోరాటాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని అన్నారు.జాతీయ పతాకాన్ని రూపొందించిన తెలుగు తేజం పింగళి వెంకయ్య సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా స్మరించుకోవాలని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు భారత్ అంతరిక్షం,సాంకేతికత, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, రక్షణ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. శాంతి, ఐక్యత, సోదరభావంతో దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారు "జైహింద్.. వందేమాతరం" నినాదాలతో దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టర్ స్నేహ,నమఃశివాయ,రెడ్నం రాజా, వడ్డాది మూర్తి,లయన్స్ క్లబ్ సభ్యులు, రాజరాజేశ్వరి ఐటీఐ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సి రాయవరంలో గ్రెవెల్ రోడ్ పనులను ప్రారంభించిన ఎంపీపీ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12**: మండల పరిధి సి రాయవరం గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి బుధవారం టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మారుమూల ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పనకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను సమదృష్టితో అభివృద్ధి చేస్తున్నారన్నారు.3 లక్షల రూపాయల వ్యయంతో గ్రావెల్ రోడ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు.అభివృద్ధి, సంక్షేమము లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల జీతాలు వెనక్కి తీసుకోవాలి!

* జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు
* తునిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు



**పెన్ పవర్ ప్రతినిధి (తుని) ఆగస్టు, 12 :** అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని ఎమ్మెల్యేల జీతాలను వెనక్కి తీసుకునేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. తునిలో ఆయన పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రజలు తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరిస్తారనే నమ్మకంతోనే ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని, అందువల్ల ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు.

ఇకపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు కేటాయించిన సీట్లలో వారు కూర్చుంటే ఆటోమేటిక్‌గా కెమెరాలు ఆన్ అవుతాయని, దాని ఆధారంగానే వారి హాజరును లెక్కల్లోకి తీసుకుంటామని స్పీకర్ తెలిపారు. ఎమ్మెల్యేలు సభకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఈ నెల 17న జరిగే బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

డీఎస్సీపై తప్పుడు ప్రచారం వద్దు

డీఎస్సీ విషయంలో జగన్, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పీకర్ ఆరోపించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని హేళన చేయడం సరికాదన్నారు. "జగన్‌కు స్పోర్ట్స్ కోటా అంటే ఏమిటో తెలుసా?" అంటూ ప్రశ్నించారు.

ప్రభుత్వ పాలన నచ్చకపోతే ప్రజలే ప్రభుత్వాన్ని మార్చుతారని, ప్రభుత్వాన్ని మార్చడానికి జగన్ ఎవరు? అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల తరఫున ఎమ్మెల్యేలు బాధ్యతగా వ్యవహరించాలని స్పీకర్ సూచించారు.

## రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి





* రీ-సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
* రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్

**కాకినాడ /తుని, పెన్ పవర్,ఆగస్టు 12:** భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేలో రైతులను భాగస్వాములను చేయాలని, ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియను నిర్వహించాలని రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు.రైతుల ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.బుధవారం కాకినాడ జిల్లా తుని మండలం తెటగుంట,హంసవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి డైరెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ రీసర్వేలో తప్పులు పునరావృతం కాకుండా, ప్రక్రియలో పారదర్శకత ఉండేలా రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే ప్రారంభించే రోజున సంబంధిత రైతు లేదా కుటుంబ సభ్యులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలన్నారు.సర్వే పూర్తయిన అనంతరం డాక్యుమెంట్లను వెరిఫై చేసి, సరిహద్దుల నిర్ధారణను కూడా రైతుల సమక్షంలోనే చేపట్టాలని సూచించారు.

రైతులకు సరైన కొలతలతో, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందే వరకు సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రీసర్వేలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా,భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామని కూర్మనాథ్ తెలిపారు. రీసర్వే అనంతరం నోటీసు రూపంలో రైతులు చూపించిన భూహద్దుల ప్రకారం భూవివరాలను తెలియజేసి,వాటిని సంబంధిత డాక్యుమెంట్లతో సరిపోల్చి నిర్ధారణ చేస్తామని వివరించారు.ఈ-కేవైసీ ద్వారా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించడంతో పాటు,వారికి ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే ఫేజ్-1లో 628, ఫేజ్-2లో 748, ఫేజ్-3లో 729, ఫేజ్-4లో 1,645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. సుమారు 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్‌ను వినియోగించి సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలోని భూవివరాలను, డాక్యుమెంట్లలోని వివరాలను రైతుల సమక్షంలోనే సరిపోల్చి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా రైతుల సంతృప్తితో రీసర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఫేజ్-5లో రాష్ట్రవ్యాప్తంగా 1,343 గ్రామాల్లో రైతులతో సమన్వయంతో క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నా మని, ఈ ప్రక్రియపై రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు సర్వే, రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారని కూర్మనాథ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాసు, పెద్దాపురం డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ రుద్రంరాజు కృష్ణంరాజు,తహశీల్దార్ జి.వి.ఎస్. ప్రసాదు,మండల సర్వేయర్ పి. సోమురు, రెవెన్యూ,సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా ర్యాలీ





* దేశభక్తిని చాటుకున్న విద్యార్థులు, ప్రజలు
* స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి
* కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 12:**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రామచంద్రపురం పట్టణంలోని విజ్ఞానభారతి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో నిర్వహించిన తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. దేశభక్తి నినాదాలు, జాతీయ జెండాల రెపరెపల మధ్య సాగిన ఈ ర్యాలీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని అన్నారు.ఎందరో మహనీయుల పోరాటం,త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని,యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదుగుతున్న తరుణంలో దేశ ఐక్యత, సమగ్రత,సార్వభౌమత్వాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు.విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని, జాతీయ పతాకం ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించి దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు దునే శ్రీనివాసు,మాజీ పట్టణ అధ్యక్షుడు కేసవ రాఘవేంద్రరావు,పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొట్టువాడ హరిబాబు,జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ సలాది సతీష్ నాయుడు, సీనియర్ నాయకులు కుప్పెల సూర్యనారాయణ,యాండ్ర బుల్లబులు,జిల్లా యువమోర్చా అధ్యక్షుడు గానాల కళ్యాణ్, జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్య గంగాధర్, కృతివెంటి పేర్రాజు పంతులు చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ సలాది వెంకప్పనాయుడు,విజ్ఞానభారతి పాఠశాల అధ్యాపకులు,విద్యార్థులు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ దేశప్రేమను చాటుకున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం.





**వాతావరణ కాలుష్యం, మాదకద్రవ్యాలు వినియోగం సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12:** వాతావరణ కాలుష్యం, మాదకద్రవ్యాల వినియోగం నేటి సమాజాన్ని ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తున్నాయని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డి. వీ.ఎస్. రాజు అన్నారు. స్థానిక సాయి శుభ ఫంక్షన్ హాల్ లో లైన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ అనసూయ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి డివిఎస్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వూర రాజబాబు, కార్యదర్శి గొల్లపూడి గణేష్ రామకృష్ణ, కోశాధికారి తండూరి రామారావు లోంచే డివీఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పటు మరో 15 మంది క్లబ్ సభ్యులను నూతన కార్యవర్గానికి దుస్సాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఎన్నికైన మరో 15 మంది క్లబ్ సభ్యులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డి వివిఎస్ రాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ రంగాల్లో విశేష సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. రానున్న భావితరానికి ప్లాస్టిక్ రహిత, మంచి పర్యావరణ పరిస్థితులను కల్పించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఇవ్వవలసిన బాధ్యత అందరికీ ఉందన్నారు.నూతన కార్యవర్గం కూడా అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నసీబ ముక్తభారత్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక నినాదం ఇచ్చారు. దానినే నిదానంగా చూసుకొని పనిచేస్తుంది. లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్లాస్టిక్ రహిత సమాజం గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలు నిర్మూలనకు యువతను చైతన్యవంతం చేసి కృషి చేయాలన్నారు. జోనల్ చైర్మన్ అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగానే ఈ సంవత్సరం 6000 మొక్కలను నాటే కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జి ఎల్ టి కోఆర్డినేటర్ కలిదిండి సత్యనారాయణ రాజు,జోనల్ చైర్ పర్సన్ అనుసూరి నాగేశ్వరరావు, రీజనల్ చైర్ పర్సన్ కే ఆర్ వి వి రమణ, పర్యావరణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ శ్రీనివాస్,పర్వత జానకి దేవి, తాళ్లూరీ గొల్లజీరావు,కోట శ్రీనివాస్ చక్రవర్తి,గోళ్ళ నాగేశ్వరరావు,రౌతు సహదేవుడు,అలమండ వెంకట దుర్గా ప్రసాదు,నర్ల చిదంబరం, వూర నాని తదితరులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు తామరాడ విద్యార్థి ఎంపిక.




**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 12:** ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు కిర్లంపూడి మండలం తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఎస్ మోహన్ దుర్గ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ కృష్ణ తెలిపారు.
గత సంవత్సరం నవంబర్ నెలలో జరిగిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ పరీక్షల్లో తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో చదువుచున్న శరగడం మోహన దుర్గ అనే విద్యార్థి పాల్గొని 94 మార్కులు సాధించి ఎన్ఎంఎంఎస్ కు ఎంపిక అవడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థిని అభినందించడమే కాకుండా, విద్యార్థి విజయానికి కారకులైన శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను,మెంటర్ గా వ్యవహరించిన పిజిటి సివిక్స్ అధ్యాపకుడు బావిశెట్టి లక్ష్మీనారాయణ ను ఈ సందర్భంగా ఎల్.కృష్ణ అభినందించారు.
ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బాలిన నూకరాజు, ఉపాధ్యాయులు సత్యప్రసాద్,తుక్కయ్య, ఏసుబాబులు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముద్రగడ కుటుంబానికి శ్రీకాకుళం జిల్లా కాపు సంఘం నాయకులు పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 12:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత,స్వర్గీయ ముద్రగడ కుటుంబానికి శ్రీకాకుళం జిల్లా కాపు సంఘం జిల్లా అధ్యక్షులు, రొక్కం సూర్య ప్రకాష్, కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు సవ్వన ఉమామహేశ్వరి, శ్రీకాకుళం జిల్లా కాపు సంఘం జనరల్ సెక్రటరీ త్రిపురాన రాజేంద్ర, పలువురు కాపు సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు.ముందుగా ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ముద్రగడ కుమారులు ముద్రగడ వీర రాఘవరావు (బాలు), ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు లను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుబూతిని తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, ముద్రగడ పద్మనాభం మృతి ఒక్క కాపు జాతికే కాకుండా,ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

## అమరావతి వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు గొల్లపాలెం జెడ్పీ విద్యార్థులు

జిల్లా స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ



**కాజులూరు ,పెన్ పవర్,ఆగస్టు 12:** రాష్ట్ర స్థాయి అమరావతి వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జీఎంసీ బాలయోగి స్టేడియంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపికల్లో గొల్లపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ముర్రే లోవ దుర్గా ప్రసాద్, బొమ్మిడి భీమా వెంకట దుర్గా ప్రసాద్, లంకా మహాదేవ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పాఠశాల పీడీ జి. సునీల్ కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం. శివశంకర్, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, శలపాక నీటి సంఘం అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త తాడి రామారెడ్డి (టిఎంఆర్) టీడీపీ సీనియర్ నాయకులు చంద్రు వీర్రాజు చౌదరి,తోట కృష్ణ, అంగర శ్రీను, పలివెల రాజు, పీడీ ఇమ్మానుయేల్ రాజ్, గంగరాజు, ప్రసాద్, శ్రీనుబాబు, ప్రమీల తదితరులు అభినందించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# చందన స్వరూపుడు వెంకటేశ్వర స్వామి నిత్య అన్నదానానికి భక్తుల విరాళం

**రూ.1,00,116 విరాళంగా అందజేసిన రాజమహేంద్రవరం చెందిన మామిళ్ళపల్లి సీత, వసంత, శ్రీరమ్య**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 12:** ఏడువారాల వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చందన స్వరూపుడైన శ్రీవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందుతున్నారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.ఏడువారాల నోము అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహించే అష్టోత్తర పూజా కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేస్తున్నారు. బుధవారం ఏడువారాల వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న రాజమహేంద్రవరానికి చెందిన మామిళ్ళపల్లి సీత, వసంత, శ్రీరమ్య కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి తమ వంతు సహకారంగా కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని సమర్పించారు.భక్తులు అందిస్తున్న విరాళాలు నిత్య అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగేందుకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు.మామిళ్ళపల్లి కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి అనుగ్రహం కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ అధికారి వై. శ్రీనివాస్, కుమార్ ,దాతలను అభినందించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఏడువారాల వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి భక్తుల రాక రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారుతున్నాయి.

## శ్రీ సూర్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో....

జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12:** మండల పరిధి యర్రవరం శ్రీ సూర్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో తిరంగా వైభవ ర్యాలీ బుధవారం ఘనంగా నిర్వహించారు.శ్రీ సూర్య విద్యా సంస్థల చైర్మన్ కోలుమల్ల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమములో విద్యార్థులచే 325 అడుగుల భారీ జాతీయ జెండాతో గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు.భారత్ మాత కి జై, జెండా మన శక్తి- దేశం మన భక్తి, జెండా మన గర్వం-దేశం మన ప్రాణం అంటూ నినాదాలలో గ్రామంలో ర్యాలీ చేశారు.
ఈ సందర్భంగా విద్యా సంస్థల ప్రిన్సిపాల్ శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జాతీయ జెండా ర్యాలీని నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడమే మా కళాశాల యాజమాన్యం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.మన జాతీయ పతాకం ప్రతి భారతీయుడి గౌరవానికి, ఐక్యతకు ప్రతీకనీ, యువత దేశ భవిష్యత్తు కాబట్టి, విద్యతో పాటు దేశం పట్ల బాధ్యత, జాతీయ విలువలు వారికి అలవడా లనితెలిపారు.ఈ ర్యాలీ ద్వారా దేశం ముందు, మనం తరువాత అనే భావనను ప్రతి విద్యార్థిలో పెంపొందించాలనుకుంటున్నామని అన్నారు.దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య మేనేజింగ్ డైరెక్టర్ లు కొలుమల్ల నవజగన్, కొలుమల్ల రేణుకా సౌజి,స్కూల్ ఇంచార్జి జి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు టి, శ్రీనివాస్, రామిశెట్టి విష్ణు, పాఠశాల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు,నర్సింగ్ కాలేజీ విద్యార్ధినులు పాల్గొన్నారు.

# మందపల్లి మందేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.75 వేల విరాళం



**కొత్తపేట, పెన్ పవర్,ఆగస్టు 12:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఆలయ ప్రధాన ప్రాంగణంలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి, శ్రీ పార్వతి అమ్మవార్ల అంతరాలయంతో పాటు ఉప ఆలయాలైన శ్రీ బ్రహ్మేశ్వర స్వామి, శ్రీ నాగేశ్వర స్వామి వారి అంతరాలయాల అభివృద్ధి పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు బుధవారం రూ.75 వేల విరాళాన్ని సమర్పించారు.

ఆలయ అంతరాలయాల్లో ఫ్లేమ్డ్ గ్రానైట్ వేయడంతో పాటు అవసరమైన గ్రానైట్, ప్లంబింగ్ మెటీరియల్, నిర్మాణ సామగ్రి కొనుగోలుకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలు చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి, శ్రీనివాస్ ప్రోత్సాహంతో హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ మాగుంట విశ్వేశ్వర ప్రసాద్ ఈ విరాళాన్ని ఆలయ అభివృద్ధి కోసం అందజేశారు.మందపల్లి శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు.స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు దేవస్థానం పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఈ క్రమంలో ఆలయ అంతరాలయాలకు ఫ్లేమ్డ్ గ్రానైట్ ఏర్పాటు చేయడం ద్వారా ఆలయ ప్రాంగణం మరింత సుందరంగా మారడంతో పాటు భక్తులకు మెరుగైన వాతావరణం కల్పించే అవకాశం ఉందని దేవస్థాన వర్గాలు పేర్కొంటున్నాయి.ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు,దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించడం పట్ల దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా భక్తుల నుంచి అందుతున్న విరాళాలను సద్వినియోగం చేస్తామని ఆలయ అసిస్టెంట్ కమీషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన శ్రీ మాగుంట విశ్వేశ్వర ప్రసాద్‌ను ఈ సందర్భంగా అభినందించారు. భక్తుల సహకారంతో దేవస్థానంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు

# ఎఫ్‌పీఓపై ఫిర్యాదుతో ఆకస్మిక తనిఖీలు.. అవకతవకలు లేవని అధికారుల నిర్ధారణ



**గండేపల్లి, పెన్ పవర్(తాళ్ళూరు) ఆగస్టు 12:**

గండేపల్లి మండలం తాళ్ళూరు గ్రామంలోని గండేపల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీఓ)పై వచ్చిన ఫిర్యాదుపై వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎఫ్‌పీఓ కార్యకలాపాల్లో ఎటువంటి అవకతవకలు గుర్తించలేదని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) తెలిపారు.

ఎఫ్‌పీఓ మేనేజింగ్ డైరెక్టర్‌గా కోల కుమారస్వామి వ్యవహరిస్తున్నారు. ఎఫ్‌పీఓలో అవకతవకలు జరుగుతున్నాయంటూ కొల్లు చంద్రరావు మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి బుధవారం ఉదయం 8.30 గంటలకు ఎఫ్‌పీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఫిర్యాదుదారుడికి ముందుగానే సమాచారం అందించి, ఆయన సమక్షంలోనే కార్యాలయాన్ని తెరిపించి తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓలోని స్టాక్ రికార్డులు, బిల్లుబుక్కులు, వివిధ లైసెన్సులు, వాటి చెల్లుబాటు గడువును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

తనిఖీల్లో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నట్లు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎంఏఓ తెలిపారు. ఎఫ్‌పీఓలో ఎటువంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. తనిఖీల అనంతరం ఫిర్యాదుదారుడు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఆకస్మిక తనిఖీల్లో ఎఫ్‌పీఓ రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సుల చెల్లుబాటును పూర్తిస్థాయిలో పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మి వెల్లడించారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12:** మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ టిడిపి సీనియర్ నాయకుడు అలమండ చలమయ్య పిలుపునిచ్చారు. ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డి.వి.వి.సత్యనారాయ ణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత కోసం సందేశం ఇస్తూ భారీ ర్యాలీ బుధవారం నిర్వహించారు.ఈ ర్యాలీ ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ప్రాంగణం నుంచి ప్రారంభమై బాలాజీ చౌక్ వరకు విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్ల కార్డులు పట్టుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బాలాజీ చౌక్ సెంటర్లో చలమయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థ, సామాజిక జీవనంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావా లపై అవగాహన కల్పిస్తే భవిష్యత్ తరాలను వాటి బారిన పడకుండా కాపాడవచ్చు న్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ సభ్యులు, ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సఖి రెడ్డి విజయ బాబు, తిరగటి వీర వెంకట సత్యనారాయణ, పూర కృష్ణ, బి.ఏ. కృష్ణ, , ప్రకృతి పర్యావరణ సభ్యులు, మహిళ హెడ్ కానిస్టేబుల్ గాయత్రి, పోలీస్ సిబ్బంది ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ శ్రవంతి, ఎస్. వంశీకృష్ణ , బ్రహ్మకుమారీలు, శ్రీ సాయి బాలాజీ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# నిబద్ధతతో సంక్షేమం.. అభివృద్ధిలో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం!





**యల్లమిల్లిలో 'ఇంటింటికి సంక్షేమం**

**ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు ఇచ్చిన హామీల అమలే లక్ష్యం**

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 12:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో చేపట్టిన 'ఇంటింటికి సంక్షేమం' కార్యక్రమం గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం) ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే నెహ్రూకు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, మిగిలిన హామీలను కూడా త్వరలో నెరవేర్చి ప్రజలకు మరింత మేలు చేస్తామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తల్లికి వందనం, పెన్షన్ల పెంపు, దివ్యాంగుల పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా ప్రయోజనం కల్పిస్తున్నామని, సామాజిక భద్రతా పింఛన్లను పెంచామని, దివ్యాంగులకు మరింత పెరిగిన మొత్తంలో పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.

యల్లమిల్లి గ్రామంలో గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించారు. నిబద్ధతతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని నెహ్రూ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, చదరం చంటిబాబు, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (సీఎం), పెనుమర్తి అర్జున్‌రావు, పెనుమర్తి భాస్కరరావు, కుంచే రామకృష్ణ, కంచుమర్తి రాఘవ, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, చీకట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# రైల్వే స్టేషన్‌లో గంజాయి కలకలం.. 60 కేజీలు సీజ్




**అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు మహిళల అరెస్ట్**

**సామర్లకోటలో జీఆర్పీ పోలీసుల తనిఖీల్లో గంజాయి పట్టివేత**

**పెన్ పవర్ ప్రతినిధి (సామర్లకోట) ఆగస్టు 12:** సామర్లకోట రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్నట్లు అనుమానిస్తున్న ఐదుగురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సామర్లకోట రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాం నంబర్లు 2, 3పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరు మహిళలను గుర్తించి వారిని పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను పరిశీలించగా భారీ మొత్తంలో గంజాయి బయటపడింది. మొత్తం 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా జీఆర్పీ రాజమండ్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు మాట్లాడుతూ రైల్వే మార్గం ద్వారా గంజాయి వంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైల్వే స్టేషన్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.

పట్టుబడిన మహిళలు నెల్లూరు జిల్లా బిట్రగుంట ప్రాంతానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపరచనున్నట్లు జీఆర్పీ అధికారులు వెల్లడించారు.

రైల్వే మార్గంలో భారీగా గంజాయి తరలింపును అడ్డుకోవడంతో సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12:** స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ది లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మరిడమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే శనివారం అమ్మవారి తీర్థ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కార్యకర్తలు వేగంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలి:
- మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహనరావు



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 12:** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహనరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గండేపల్లి మండల టీడీపీ కార్యాలయంలో పోతుల మోహనరావు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. అనంతరం పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.

ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలి

'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలు వెల్లడించే సమస్యలను 'మై టీడీపీ' యాప్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారానికి పార్టీ శ్రేణులు చొరవ చూపాలని నిర్ణయించారు.

అలాగే అర్హులైన వారికి పింఛన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సంక్షేమ ప్రయోజనాలు తక్షణమే అందేలా కృషి చేయాలని తీర్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

రాష్ట్రాభివృద్ధి వేగం పుంజుకుంది

ఈ సందర్భంగా పోతుల మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు.

అమరావతి, పోలవరం, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో వివరించడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, కంటిపూడి రామయ్య, పైల వెంకన్న, ఆళ్ల సత్తిబాబు, చిటికెల కన్నబాబు, చాగంటి వెంకట కృష్ణమోహన్, పెనుగాడి నాగరాజు, నాళం వీరబాబు, ముంగర విష్ణుమూర్తి, ఉండవిల్లి రాధాకృష్ణ, చంద్రు బ్రహ్మరాజు, ముంగర సూర్యరావు, వెంపాటి రాంబాబు, సానిపినీ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## స్థాయీ సంఘ సమావేశాల్లో అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష






**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 12**: కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు విప్పర్తి వేణుగోపాల రావు అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వైస్ చైర్‌పర్సన్, 3వ స్థాయీ సంఘ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ సంఘ సమావేశం, మేరుగు పద్మలత అధ్యక్షతన 6వ సంఘ సమావేశం, రొంగల పద్మావతి అధ్యక్షతన 5వ సంఘ సమావేశం వేర్వేరుగా నిర్వహించారు.

ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులైన జెడ్పీటీసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రజాప్రతినిధులు, నాలుగు జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. నీటిపారుదల, ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, గృహనిర్మాణం, విద్యుత్ తదితర రంగాల్లో ఇప్పటివరకు సాధించిన ప్రగతితో పాటు 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన కొత్త పనుల వివరాలను సంబంధిత అధికారులతో చర్చించారు.రైతులకు సాగునీరు విడుదల చేయాలి

3వ స్థాయీ సంఘ చైర్మన్ బుర్రా అనుబాబు, గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యులు రైతులకు వరి సాగు కోసం తక్షణమే నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు వారం రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల సాగుపై సభ్యులకు అవగాహన కల్పించడంతో పాటు పంటలకు ప్రభుత్వపరంగా అందే బీమా వివరాలను వివరించారు.వైద్యం, రహదారులపై దృష్టి

6వ స్థాయీ సంఘ చైర్మన్ మేరుగు పద్మలత తొండంగి మండలంలో రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సమయంలో గర్భిణులకు రక్తం కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.జగ్గంపేట, రాజోలు, మామిడికుదురు, రౌతులపూడి, గంగవరం ఏజెన్సీ, మారేడుమిల్లి జెడ్పీటీసీ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్ నిర్మించాలని కోరారు.రాజోలు మండలం చేన్నడం గ్రామంలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యులు తమ మండలంలోని కొన్ని గ్రామాల్లో పంట కాలువల పూడికతీత పనులను పూర్తి చేయాలని కోరారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

సమావేశంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖాధికారి, సాంఘిక సంక్షేమ శాఖాధికారి, ఇతర శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న పథకాల ప్రగతి నివేదికలను, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను సభకు వివరించారు.అనంతరం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు మీడియాతో మాట్లాడుతూ ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ప్రజల నుంచి వెలువడుతున్న సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి. శ్రీలలిత, వివిధ జిల్లాల శాఖాధికారులు, జెడ్పీ పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద భరితంగా ప్రత్తిపాడు ప్రధాన ఆర్ అండ్ బి రహదారి.

-తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ధరణాలకోట డిమాండ్.





కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 12:ప్రత్తిపాడు నుండి ధర్మవరం వైపు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి ప్రమాద భరితంగా మారింది.రెండుచోట్ల భారీగా గుంతలు పడి అధ్వానంగా మారింది.నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పిసిసి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను. డిమాండ్ చేశారు.

## టిడిపి పార్టీ బలోపేతమే లక్ష్యం -- మండల స్థాయి సమావేశంలో



**సీతానగరం పెన్ పవర్, ఆగస్టు:12:**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో బుధవారం నిర్వహించే మండల స్థాయి సమావేశంలో భాగంగా మండలంలోని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గెద్దం తిమ్మారావు , అధ్యక్షతన రాజనగరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మరియు రుడా చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదేశాల మేరకు బుధవారం నాడు ముగ్గళ్ళ గ్రామంలో క్లస్టర్ ఇన్చార్జిల సమావేశం నిర్వహించారు. ఇనగంటి వారి పేట క్లస్టర్ ఇన్చార్జి బిక్కిన సతీష్ 100% డోర్ టు డోర్ కార్యక్రమం పూర్తి చేయడంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు గెద్దం తిమ్మారావు మాట్లాడుతూ టిడిపి పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో మండల స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు అపరాల సాగు ఎంతో ఉత్తమం.

- మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత.
- బౌరువాకలో ఆత్మనిర్భర్ పథకం కింద క్లస్టర్ శిక్షణ.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు,12:**ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటి వసతులతో,తక్కువ కాల వ్యవధిలో చేతికొచ్చే మినుము,పెసర వంటి అపరాల పంటలను సాగు చేసి మంచి ఆదాయం పొందాలని ప్రత్తిపాడు మండలం వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత సూచించారు.ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా బుధవారం బౌరువాక గ్రామంలో మినుము,పెసర పంటల సాగుపై ఏర్పాటు చేసిన సామర్థ్యాభివృద్ధి క్షేత్ర పాఠశాల క్లస్టర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జోకా అమృత రైతులకు అపరాల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వీబీఎన్-8, వీబీఎన్-9 మినుము రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఈ రకాలు సుమారు 65 నుంచి 70 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉన్నందున రైతులకు అనుకూలంగా ఉంటాయని వివరించారు.పంట నాణ్యత,దిగుబడి పెంచేందుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని,సమగ్ర పోషకాల యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు.అపరాల పంటలను ఆశించే పచ్చదోమ,పేనుబంక వంటి రసం పీల్చే పురుగుల నివారణకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.రసాయన ఎరువులు,పురుగుమందుల వినియోగాన్ని అవసరమైన మేరకు మాత్రమే చేపట్టి,సరైన సమయంలో తగిన మోతాదులో మందులు పిచికారీ చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని,తద్వారా రైతులకు అధిక లాభాలు లభించే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బాల,గ్రామ పెద్దలు,బౌరువాక ప్రాంతానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాకంబరి దేవి గా చింతలూరు శ్రీ నూకాలమ్మ





**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 12;**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారు ఆషాడ బహుళ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ రకాల కూరగాయలు పండ్లతో శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. కరువు కాటకాలను నివారించే శాకంబరి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అత్యంత శుభప్రదమైన ఫలితాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. చింతలూరుతో పాటు పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీ నూకాంబికా అమ్మవారిని దర్శించుకుని సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, స్వీట్లు చీర, సారే సమర్పించి తమ మొక్కుబడును తీర్చుకున్నారు. ఈ మహోత్సవం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి, అలయ చైర్మన్ వీరి అప్పారావు గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.